క్లుప్తంగా

మియాపూర్ పోలీస్‌స్టేషన్ సమాచారం

సీఐ : తిరుపతిరావు	9490617129
సెక్టార్–1 ఎస్ఐ: అహ్మద్ పాషా	8712663175
సెక్టార్– 2 ఎస్ఐ: ఆర్.రాఘవేందర్	8712663172
సెక్టార్–3 ఎస్ఐ: బి.రవికుమార్	9000123281
సెక్టార్–4 ఎస్ఐ: గిరీష్	9953630403
సెక్టార్–5 ఎస్ఐ: దశరథ్	9848863569
క్రైమ్ డీఐ : కాంతారెడ్డి	9703337572
క్రైమ్ ఎస్ఐ : జగదీశ్వర్	9493630364
పెట్రోలియం–1	8333993414
పెట్రోలియం–2	8333993415

ట్రిపుల్‌ఐటీలో నాలుగు స్టార్టప్‌లు ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌గా గుర్తింపు పొందిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ) ఆధ్వర్యంలో ఆవిష్కార్ డీప్ టెక్ యాక్సిలరేటర్ సమ్మర్–2023 కోహోర్ట్‌ను ప్రారంభించారు. కోహోర్ట్ డీప్ టెక్, మెడ్‌టెక్, మీడియాటెక్, మొబిలిటీ డొమైన్ నాలుగు స్టార్టప్‌లతో ప్రారంభించారు. ఈ స్టార్టప్‌లు సీడ్ ఫండ్‌తో పాటు 6నెలల ప్లాన్‌ను అందుకుంటాయి.

ప్లాస్టిక్‌ను వినియోగించం

- వైశాలీనగర్ కాలనీవాసుల ప్రతిజ్ఞ



హఫీజ్‌పేట్: వైశాలీనగర్ కాలనీలో ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పిల్లలతో ప్రతిజ్ఞ చేసి పార్కులు ,కాలనీలోని రోడ్లపై చెత్త సేకరించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చిరంజీవులు, సిరి, లక్షిత, ఆశిష్, బబ్లూ, పవన్, అభి యశ్వంత్, జ్వలిత, సాహూ, కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు ప్రారంభం



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఆలింద్, బాపూనగర్‌లలో మంజీర పైప్‌లైన్ మరమ్మతు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం ప్రారంభించారు. పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతుండటంతో వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ మాట్లాడారు. టీఆర్ఎస్ నాయకులు గోపాల్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, రవీంద్ర రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రోత్సాహమేది?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వడంలేదని బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా మాజీ ప్రధానకార్యదర్శి గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక సంక్షోభం తీవ్రంగా కనిపిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే మూతపడిన పరిశ్రమలను తెరిపించి, యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. లక్ష్మణ్‌గౌడ్, ఉాములు యాదవ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచినీటి వృథా



చిత్తారమ్మ ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకేజీ

ఆల్విన్‌కాలనీ: పైపులైన్ లీకేజీలతో మంచినీరు ఏరులైపారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ శ్రీ చిత్తారమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిలో సుమారు నెల రోజులు నుంచి మంచినీటి పైపులైన్ ప్రధాన వాల్వ్ లీకేజీతో నీరు కిలోమీటర్ల కొద్దీ ఏరులై పారుతోంది. ఈ రహదారిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. సమస్య అలాగే ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గుర్రపు డెక్క, మురుగు నీటితో నిండిన పటేల్ చెరువు



చెరువుకట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు

నిధులన్నీ నీళ్లపాలు..

అభివృద్ధికి నోచుకోని పటేల్‌చెరువు



చెరువు శిఖం భూమిలో మట్టిని నింపిన దృశ్యం

మియాపూర్: చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదు. నిండుకుండలా ఉండాల్సిన చెరువులు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, మురుగు నీటితో నిండిపోయాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువున అభివృద్ధికి గత ఐదేళ్ల క్రితం రూ.12 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టారు. కనీసం ఇప్పటి వరకు 40 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. సుందరీకరణలో భాగంగా చెరువుచుట్టు మట్టి పోసి చెరువు కట్ట ఏర్పాటు చేశారు. అలుగు నిర్మించి వదిలేశారు. చెరువులో మురుగు నీరు కలవకుండా డైవర్షన్ పైపులైన్ పనులను సగం ఏర్పాటు చేసి మధ్యలోనే వదిలేశారు. ఇక చెరువులో నీటిని తోడేయడంతో చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటిపోయి స్థానికులు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

- పటేల్ చెరువు అభివృద్ధిలో భాగంగా చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని కట్ట ఏర్పాటు చేశారు. ఐతే ఈ పనులు పూర్తికాకపోవడంతో చెరువుకట్టపై ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చెరువుపై భాగంలో ఉన్న కాలనీల నుండి మురుగు నీరు నేరుగా చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువు పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీనికితోడు దోమలకు ఆవాసంగా మారింది. దుర్వాసన, దోమలతో ఇబ్బందిపడుతున్నామని చుట్టుపక్కల కాలనీలవాసులు వాపోతున్నారు.
- మియాపూర్ పటేల్ చెరువు పైభాగంలో ఉన్న గురున్నాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు వచ్చే నాలా పూర్తిగా ఆక్రమణలకు గురికాగా ఒక్క మీటరు మిగిలి ఉంది. చెరువుల్లో నీరు లేకపోవడంతో పాటు ఫెన్సింగ్ లేకపోవడంతో ఆక్రమణకు గురైంది.

కబ్జా బారిన...

- ఐదేళ్ల క్రితం అధికారులు అభివృద్ధి పేరిట చెరువులో నీటిని తొలగించడం కబ్జాదారులకు వరంగా మారింది. బఫర్, శిఖం భూమిలలో మట్టి పోసి పూడ్చి పెద్ద పెద్ద భవనాలు చేపట్టారు. సంబంధిత అధికారులు చెరువు శిఖం భూములలో వేసిన కంచె ,అలాగే సర్వే చేయకుండా ఇష్టానుసారంగా చెరువుకట్టలను ఏర్పాటు చేయడంతో కబ్జాదారులకు వరంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు చుట్టు మట్టితో కట్ట వేశారు. చెరువులో డ్రైనేజీ కలవకుండా కొంత భాగం వరకు డైవర్షన్ పైపులు ఏర్పాటు చేశారు.
- పటేల్ చెరువు సర్వే నంబర్ 70లో 38.20 ఎకరాలతో సర్వే నంబర్ 71 పార్ట్‌లో 1.20 గుంటలు, 72 పార్ట్‌లో 12 గుంటలు, 87 సర్వే నంబర్ 11 గుంటలు, 89 సర్వే నంబర్‌లో 1.31 గుంటలు శిఖం భూమిలో విస్తరించి ఉంది.
- కాగా మియాపూర్‌లోని టీఎస్‌నగర్ వైపు చెరువుకట్ట పైపులైన్లు దాటి శిఖం భూమిలో గత కొన్ని రోజుల నుండి భారీగా మట్టి పోశారు. చెరువు శిఖం భూమిలో ఒక ఎకరా స్థలంలో దర్జాగా మట్టిని నింపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెరువుకట్ట, పైపులైన్ పనులు చేపట్టిన తరువాత కూడా చెరువు శిఖం భూమిలో మట్టి పోయడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువులో పెద్ద పెద్ద గుంతలు తవ్వి వదిలేశారు. ఆ గుంతలను పూడ్చకపోవడంతో అందులో మురుగునీరు చేరింది. గత కొద్ది రోజుల క్రితం ఓ బాలుడు, జలమండలి ఔట్ సోర్సింగ్‌లో పనిచేసే ఉద్యోగి ఆ గుంతల్లో పడి మృతి చెందినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది



జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జోనల్ మేనేజర్ టీఎస్ఐఐసీ సైబరాబాద్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని టెక్‌మహేంద్ర లెర్నింగ్ వరల్డ్ మీటింగ్‌హాల్‌లో విద్యుత్ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవేళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు రాగం నాగేందర్, వెంకటేశ్, డీసీ వెంకన్న, డీసీ సుధాంష్‌లు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పారిశ్రామిక రంగం దూసుకుపోతోందని, హైదరాబాద్ నగరం విశ్వనగరంగా దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని, సిలికాన్ వ్యాలీకి దీటుగా టీ–హబ్, వీ–హబ్‌లు ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మెజారిటీ ఐటీ కంపెనీలు కేంద్రీకృతమయ్యాయని, రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, తాగునీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం సమర్థంగా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఏసియా గ్లోబల్ హెడ్ మైండ్ స్పేస్ సీవిన్ వర్మ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కుంగిన మ్యాన్‌హోల్



కృషినగర్ కాలనీలో..

మియాపూర్: మియాపూర్‌లోని కృషినగర్ కాలనీలో రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో మురుగు నీరు రోడ్డు పై ప్రవహిస్తోంది. రోడ్డు మధ్యలో ఉండడంతో స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా స్థానికులు మ్యాన్‌హోల్ చుట్టు రాళ్లు పెట్టి సూచిక ఏర్పాటు చేశారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

శ్రీరామనగర్‌లో బీజేపీ నాయకుల పర్యటన



శ్రీరామ్‌నగర్‌లో కరపత్రాలను అందిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండాపూర్ డివిజన్‌లోని శ్రీరామనగర్ ఏబ్లాక్‌లో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికీ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్లుగా ఎమ్మెల్యే గాంధీ ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యే అనుయాయుల స్వలాభం కోసం అవినీతికి, అక్రమాలు, భూ కబ్జాలు, వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది, ప్రజలకు సేవ చేసింది భిక్షపతియాదవ్ మాత్రమేనని అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తామని, బీజేపీ అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు ఓబుల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకటేష్, అనంతరెడ్డి, రంగస్వామి, ఆంజనేయులు, కృష్ణ, పద్మ, పార్వతి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా తెలంగాణ పారిశ్రామిక విధానం

- తొమ్మిది సంవత్సరాల్లో గణనీయమైన ప్రగతి
- 15 రోజుల్లోనే నూతన పరిశ్రమలకు అనుమతులు
- అంతర్జాతీయ పరిశ్రమలకు కేంద్రం హైదరాబాద్
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: దేశంలోనే తొలిసారిగా పరిశ్రమల అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఏకగవాక్ష విధానంతో అంతర్జాతీయ పరిశ్రమలకు రాష్ట్రం చిరునామాగా మారిందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పటాన్‌చెరులో తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ శరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణకు ఉద్యమకారుడిని ముఖ్యమంత్రిని చేసిన ఘనత తెలంగాణ ప్రజలకే దక్కిందన్నారు. పరిశ్రమలకు అనుమతులు, విద్యుత్తు, మానవ వనరులు, నీరు తదితర మౌలిక వసతులను కల్పించడంలో సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న విధానాల కారణంగా వేల సంఖ్యలో నూతన పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసియాలోని అతి పెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా కాలుష్యానికి చిరునామాగా ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ పారిశ్రామిక రంగంలో ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణల మూలంగా 90 శాతం కాలుష్యం తగ్గిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, దేవానందం, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజా వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు లలితా సోమిరెడ్డి, తుమ్మల పాండురంగారెడ్డి, రోజా బాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్ప నగేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రశాంత్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

పటాన్‌చెరు: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వాణినగర్ కాలనీకి చెందిన నరేందర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం నిమిత్తం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేసుకున్నారు. అతనికి మంజూరైన రెండున్నర లక్షల రూపాయల ఎల్ఓసీని మంగళవారం నరేందర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఎంపీపీ దేవానందం పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల నల్లగండ్ల ప్రైమరీ స్కూల్ నుంచి గురుకుల స్కూల్‌కు 6 గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 4వ తరగతి విద్యార్థులు యశ్వంత్, నాని, శిరీష, రాజేశ్వరి, మోక్షిత్, ఆంజనేయులు ఎంపికయ్యారని వివరించారు. వారికి టీసీ, స్టడీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు రవీందర్‌రెడ్డి, సుజాత, రమణి, దీక్షిత్‌లు పాల్గొన్నారు.

8న భైరుని చెరువు వద్ద ఉత్సవాలు

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఊరూరా చెరువుల పండగ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న బాచుపల్లి భైరుని చెరువు వద్ద ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఇరిగేషన్, ఆయా విభాగాల అధికారులతో మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చెరువులను ఆధునికీకరించడంతో మత్స్యకారులకు లాభదాయకంగా మారిందన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యే అవకాశముందని, తగు ఏర్పాట్లు చేపట్టాలని మేయర్ నీలారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, కాసాని సుధాకర్ ముదిరాజ్, అధికారులు పాల్గొన్నారు.

పక్కింటి గొడవ

- భర్త అడగలేదని భార్య ఆత్మహత్య



శిరీష (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పిల్లలు గొడవ పడడంతో పక్కింటి వారు తిట్టారని, ఈ విషయంను భర్త పట్టించుకోలేదని అతనితో గొడవపడి ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..రామచంద్రాపురంలోని బొంబాయి కాలనీకి చెందిన శిరీష(25) 2019లో పటాన్‌చెరు మండలం ఇంద్రేశానికి చెందిన మన్నే గణేష్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఆదివారం సాయంత్రం శిరీష కూతురు పల్లవి పక్కింటి పిల్లలు గొడవపడ్డారు. ఈ విషయంలో పక్కింటివారు ఆమెను తిట్టారని భర్త గణేష్‌కు ఫోన్‌లో చెప్పింది. భర్త ఇంటికి రాగానే పక్కింటి వారిని తిట్టిన విషయంపై అడిగావా అని ప్రశ్నించింది. తనను పక్కింటివారు తిట్టినా, కుటుంబ సభ్యులు తిట్టినా భర్త పట్టించుకోవడంలేదని బాధపడింది. సోమవారం రాత్రి 11గంటల సమయంలో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు పెట్టుకుంది. భయానికి గురైన గణేష్ వెంటనే వెళ్లి తలుపులు కొట్టగా ఎంతసేపటికి తీయలేదు. దీంతో అతను తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూశాడు. శిరీష చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. చున్నీ విప్పి కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కూతురు మృతిపై అనుమానం ఉందని తల్లి లక్ష్మిఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎనిమిది మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

జూన్ 1న మిస్సింగ్ కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం చిట్కుల్ పరిధిలోని బాలాజీ హోమ్స్‌లో నివాసం ఉంటున్న సోమ సతీష్(44) పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బీ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మే30వ తేదీన తన భర్త రాత్రి డ్యూటీకని వెళ్లి తిరిగి రాలేదని ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని భార్య శ్రీదేవి పేర్కొన్నారు. దీంతో ఆందోళనకు గురైన ఆమె జూన్ 1న బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇది ఇలా ఉండగా మే 31 మధ్యాహ్నం రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ శివారులోని రైల్వే ట్రాక్‌పై రైల్వే పోలీసులకు మృతదేహం లభ్యమైంది. దీంతో వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు రైల్వే పోలీసులను సంప్రదించారు. దీంతో మంగళవారం పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి కుటుంబీకులకు అప్పచెప్పారు. కాగా పరిశ్రమ యాజమాన్యం వేధింపులతోనే తన భర్త మృతి చెందాడంటూ కుటుంబీకులు, బంధువులతో కలిసి మృతదేహాన్ని తీసుకొని పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఇవ్వడంతో పాటు చట్టపరమైన బెనిఫిట్స్ అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చెత్త సమస్య



మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల నుంచి వెళ్ళే నాలా పక్కన చెత్త



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద పేరుకుపోయిన చెత్త

హఫీజ్‌పేట్ : న్యూహఫీజ్‌పేట్ ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల మధ్య ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద చెత్తచెదారం గుట్టలుగా పేరుకుపోయింది. పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. కాగా స్థానికులు చెత్త ఆటోలకు ఇవ్వకుండా రోడ్లపైన వేస్తున్నారు. చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తింటున్నాయి. జీర్ణం కాక ప్రాణాలు వదులుతున్నాయి. న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవడంతో బాటు నాలాలో చెత్త వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. చెత్త వేసే చోట శుభ్రం చేసి బస్తీవాసులకు అవగాహన కల్పించాలని పలువురు అంటున్నారు.న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనకు అటు వెళ్లలేకపోతున్నాం అని ప్రేమ్‌నగర్‌వాసి సలీం పేర్కొన్నారు. అలాగే హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ నుంచి ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ వరకు రాత్రిపూట యువకులు గంజాయి తాగుతున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని మార్తాండనగర్‌కు చెందిన కృష్ణ యాదవ్ కోరారు.